శుభపంతు వరాళి - ఆది

ఏ కులజుడైన నేమి - యెవ్వడైన నేమి
ఆకడ నాతడె - హరినెరిగిన వాడు

పరగిన సత్య సం - పన్నుడైన వాడే
పరనింద సేయ త - త్పరుడు గానివాడు
అరుదైన భూతద - యానిధి యగువాడె
పరులు తానేయని - భావించు వాడు

నిర్మలుడై ఆత్మ - నియతి గలుగువాడె
ధర్మ తత్పర బుద్ధి - తగిలిన వాడు
కర్మమార్గములు - గడవని వాడె
మర్మమై హరిభక్తి - మరువని వాడు

జగతిపై హితవుగా - జరియించు వాడు
పగలేక మతిలోన - బతికిన వాడు
తెగి సకలము నాత్మ - దెలిసిన వాడే
దగిలి శ్రీ వేంకటేశు - దాసుడైన వాడు

తన సంకీర్తనలలో ఉపనిషత్తులనూ, ఋఙ్మంత్రాలనూ ఇమిడించి 'ఆంధ్రవేదం' అన్న మాటను తన సాహిత్యానికి పర్యాయపదంగా ప్రతిష్టించిన పదకవితాపితామహుడు అన్నమాచార్యులు. ఈ సంకీర్తనలో భగవద్గీత రెండవ అధ్యాయంలో శ్రీకృష్ణపరమాత్ముడు ఉద్బోధించిన స్థితప్రజ్ఞుని లక్షణం నిర్వచితమైనది. భగవద్గీత పంచమవేదమైన భారతాంతర్గతం. వేదాలన్నింటినీ తనలో ఇముడ్చుకొన్న ఆంధ్రవేదం అన్నమాచార్యులది.

జన్మవల్ల ఎవరికీ ఉన్నత కలగదు. కర్మపరిపాకం వల్ల మాత్రమే ఔదాత్యం కలుగుతుంది. ఏకులంలో జన్మించినా జీవనోపాధికై ఏ వృత్తి అవలంభించినా చివరకు పరమేశ్వరత్వాన్ని జ్ఞానమార్గంలో తెలిసికొని ఆ తత్వసారాన్ని ఆకళింపు జేసుకోగలవాడు, హరిభక్తి అనే ఆలంబనగలవాడు, అతడే స్థితప్రజ్ఞుడు. అతని లక్షణాలివి.

1. సత్యభాషణ 2. పరనిందా పరాఙ్ముఖత్వం 3. అపారభూతదయ 4. 'ఆత్మవత్సర్వ భూతాని' తనవలె జగత్సర్వాన్ని దర్శించే లక్షణం 5. శమదమాది ఆత్మ సంయమనం

6. ధర్మతత్పరత 7. వైదిక నిత్యకర్మానుష్ఠానం 8. హరిచరణకమలా విస్మరణ 9. రాగద్వేష రాహిత్యం 10. జగద్ధితప్రవృత్తి 11. అంతర్ముఖదృష్టిచేత కలిగే జ్ఞానసిద్ధి ఈ లక్షణాలన్నీ కలిగినవాడే స్థితప్రజ్ఞుడు.  శ్రీవేంకటేశ్వరచరణ దాసుడుకానివాడు స్థితప్రజ్ఞుడు కాలేడు. ఈ సంకీర్తనలో చెప్పబడ్డ స్థితప్రజ్ఞుడు అన్నమాచార్యులేనని కొంచెం లోతుగా ఈ విష యాన్ని చర్చించినవారికి అవగతమౌతుంది.